
సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



న్యూస్‌రీల్

కేటీఆర్‌పై గౌరారం పీఎస్‌లో ఫిర్యాదు

వర్గల్(గజ్వేల్): హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం గౌరారం ఎస్‌ఐ శివకుమార్‌ను కలిసి ఫిర్యాదుపత్రం అందజేశారు. జై శ్రీరామ్ అనకూడదని, జై శ్రీరామ్ అంటే ఉద్యోగాలు రావని చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగు ప్రదీప్‌గౌడ్, మఠం మహిపాల్‌యాదవ్, దిండి నాగరాజుగౌడ్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లను తట్టుకునే వరిని సాగు చేయాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

నంగునూరు(సిద్దిపేట): వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహా, సూచనలు తీసుకొని తెగుళ్లు తట్టుకునే వరి పంటను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం తోర్నాల శాస్త్రవేత్తలతో కలిసి ఆయన ముండ్రాయిలోని వరి పొలాలను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రైతు రాజయ్య పొలంలో వెద జల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పంటను పరిశీలించి వరంగల్ 1537 రకం వరి విత్తనాలను అందజేశారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ వరంగల్ రకం వరి పంట కాండం కుళ్లు తెగులు, అగ్గి తెగులు పురుగును తట్టుకొని 125 రోజుల్లోనే పది శాతం అధిక దిగుబడి వస్తుందన్నారు. వానా కాలం, యాసంగికి అనుకూలమైన ఈ విత్తనాన్ని సాగు చేయడం ద్వారా అధిక లాభాలు గడించవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సతీష్‌చంద్ర, వెంకన్న, పల్లవి, విజయ్, ఏఓ గీత, ఏఈఓ అశోక్, మీరాబాయి, ప్రేమ్‌సాగర్, సాయివర్మ, శిరీష, రేఖ, వరుణ్ వర్మ, రైతులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో లబ్ధి కోసమే హరీశ్ డ్రామాలు

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారం పోగానే రైతుల పేరుతో లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి కోసం డ్రామాలు ఆడుతున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. శనివారం చిన్నకోడూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో రెండు ప్రాజెక్టులు ఉంటే ఒకే ప్రాజెక్టుకు రెండు రకాల పరిహారాలు అందించి రైతులను ముంచింది హరీశ్ కాదా అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అందరికీ ఒకే రకం నష్ట పరిహారం చెల్లించిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నాయకుల డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు మహేందర్, పర్శరాములు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో దొంగల పట్ల జాగ్రత్త

సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేటకమాన్: ఇళ్లకు తాళాలు వేసి ఊర్లేళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడారు. వేసవిలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమిషనరేట్ పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొత్త వారి కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. వేసవి సెలవుల్లో చాలా మంది ప్రయాణాలు చేస్తుంటారని ఇదే అదనుగా దొంగలు తమ చేతివాటం ప్రదర్శిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దూర ప్రాంతాలకు, తీర్థ యాత్రలకు వేళ్లే వారు దగ్గర్లోని పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు, నగదు ఇళ్లలో ఉంచి తాళాలు వేసి వెళ్లకూడదన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై డయల్ 100, సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూం 8712667100కు సమాచారం అందించాలన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 3.36 కోట్లు

- మరమ్మతుల కోసం జిల్లా వ్యాప్తంగా 394 పనులు గుర్తింపు
- సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 08457230000

సాక్షి, సిద్దిపేట: వేసవి కాలంలో పల్లెల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా ఎద్దడి నివారణకు నిధులను మంజూరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 499 గ్రామ పంచాయతీలుండగా ఆవాసాలు 756 ఉన్నాయి. వీటికి తాగునీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు మరమ్మతు చేసే పనులను గుర్తించారు. అంచనాలు వేసి మిషన్ భగీరథ ఉన్నత అధికారులకు పంపితే నిధులు మంజూరు చేశారు. ఈ పనులను ఇటీవల ప్రారంభించారు.


చేర్యాల మండలం నాగపూరిలో బోర్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

394 వర్క్‌లు...

జిల్లాలో 1,607 ఓవర్‌హెడ్ ట్యాంక్‌లుండగా 3,164 కిలో మీటర్ల పైప్‌లైన్ ద్వారా 2,32,223 గృహాలకు నల్లాల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. మరమ్మతులను చేపట్టేందుకు గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓల ద్వారా 394 పనులను మిషన్ భగీరథ అధికారులు గుర్తించారు. ఈ పనుల కోసం రూ 3.36 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పైప్‌లైన్ లీకేజీ, హ్యాండ్ పంప్, మోటార్ మరమ్మతులు, పలు చోట్ల కొత్తగా పైప్‌లైన్లు వేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారి భారతి హొల్లికేరిని నియమించారు.

మండలం పేరు	వర్క్‌లు	నిధులు (రూ.లక్షల్లో)
అక్కన్నపేట	31	25.50
బెజ్జంకి	23	15.50
కోహెడ	26	20.00
హుస్నాబాద్	17	16.00
సిద్దిపేట అర్బన్	10	8.00
సిద్దిపేట రూరల్	11	9.50
నారయణరావుపేట	08	6.50
చిన్నకోడూరు	20	17.00
నంగనూరు	14	16.00
దుబ్బాక	30	14.00
తొగుట	16	12.50
మిరుదొడ్డి	20	17.50
దౌల్తాబాద్	21	16.00
రాయపోలు	18	13.00
గజ్వేల్	16	16.00
జగదేవ్‌పూర్	11	16.00
మర్కూక్	13	10.50
ములుగు	15	15.50
కొండపాక	20	18.00
వర్గల్	22	18.00
చేర్యాల	09	12.00
కొమురవెల్లి	10	7.50
మద్దూరు	13	15.50

టోల్ ఫ్రీ ...

తాగునీటి సమస్యలు ఎక్కడైన తలెత్తితే ఫిర్యాదు చేయవచ్చు. కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ 08457230000 నంబర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యల కోసం సంబంధిత అధికారులకు పంపించనున్నారు. ఫిర్యాదులను పరిష్కరించారా లేదా అని కలెక్టర్ పరిశీలించనున్నారు.

15 రోజుల్లో మరమ్మతులు పూర్తి

మరమ్మతుల కోసం గుర్తించిన పనులు 15 రోజుల్లో పూర్తి చేస్తాం. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షిస్తూ తాగునీటిని పల్లెలకు సరఫరా చేస్తున్నాం.
– గిరిధర్, ఈఈ మిషన్ భగీరథ


నారాయణఖేడ్ హోటల్‌లో టీ సేవిస్తున్న జనాలు

వెరైటీ

సండే స్పెషల్



చాయ్ తాగనిదే మొదలు కాని రోజు • టీ సేవిస్తే చికాకులు దూరం
పట్టణాల్లో జోరుగా వ్యాపారం • స్టాల్స్ ఏర్పాటుకు విద్యావంతుల ఆసక్తి
• మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.100 వరకు టీ లభ్యం

చాయ్ చటక్కునా తాగరా భాయ్..
చాయ్ చమక్కులే చూడరా భాయ్..
చాయ్ ఖరీదులో చీప్ రా భాయ్..
చాయ్ ఖుషీలనే చూపురా భాయ్..

అని ఓ సినీ కవి చాయ్ గురించి వర్ణించాడంటే దీని మనిషి జీవితంలో ఎంతటి ప్రాముఖ్యత సందరించుకుందో అర్థం చేసుకోవచ్చు. ప్రతీఒక్కరు ఉదయాన్నే టీ తాగడంతో రోజును ప్రారంభించడం పరిపాటిగా మారింది. ప్రపంచవ్యాప్తంగా మంచినీటి తర్వాతం ఎక్కువ మంది తాగుతున్నది టీనే. టీ లవర్స్ ఎక్కువ కావడంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీని ద్వారా వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

– నారాయణఖేడ్ (వెంకటేశ్)

పట్టణాల్లో టీ హోటళ్లు భారీ ఎత్తున ఏర్పాటవుతుంది. పైకి చూస్తే సాధారణ టీ స్టాలే కానీ అందులో జరిగే వ్యాపారం మాత్రం వేలల్లో ఉంటుంది. ఉన్నత చదువులు చదివిన వారు సైతం టీ స్టాల్స్ ఏర్పాటు చేసి తాము ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ లాంటి నియోజకవర్గ కేంద్రాలతోపాటు పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో భారీగా టీ కొట్లు ఏర్పాటయ్యాయి. జిల్లాలో సుమారుగా 800పైగా ప్రధాన టీకొట్లు ఉంటాయి. ఇందులో నిత్యం ఒక టీకొట్టులో రూ.10వేల వరకు వ్యాపారం సాగగా సరాసరి జిల్లాలో రోజుకు రూ.50 లక్షల నుంచి 60లక్షల వరకు వ్యాపారం సాగుతుంటుంది. ఒక్కో హోటల్‌లో ముగ్గురు మొదలుకొని 10మంది ఆపైగా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఉన్నత చదువులు చదివిన వారు సైతం టీ వ్యాపారం దిశగా అడుగులు వేస్తున్నారు. నిర్వాహకులు నెలకు ఖర్చులు పోను రూ.25వేల నుంచి 50వేల వరకు వేతనంగా పొందుతున్న వారూ ఉన్నారు. రూ.10 నుంచి రూ.100 విలువగల టీలు ఉన్నాయి.

మరికొన్ని టీ రకాలు..

అల్లం, గ్రీ, , సొంటి, బ్లాక్, ఊలాంగ్, నిమ్మకాయ, వైట్, మందార, బెల్లం, రోస్ట్, స్ట్రాబెర్రీ, పాన్, మసాలా, కేరళ బట్టర్, కాశ్మీర్ డ్రైఫ్రూట్ టీ, కేరళ బట్టర్ టీ, రాజస్థాన్ రాజ్‌వాడీ టీ, పెప్పర్ మిల్క్, తందూరీ ఇలా అనేక రకాలు చాయ్ దుకాణాల్లో అందుబాటులో ఉంటున్నాయి.

నిత్యం టీ తాగుతా..



రోజూ టీ తాగుతాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదారుపైగా టీలు అవుతాయి. మిత్రులు కలిసినా టీ సాధారణమే. టీ తాగిదే దాని అనుభూతే వేరుగా ఉంటుంది.
– మొహ్మద్ సలీం, వ్యాపారి, నారాయణఖేడ్

టీకి రూ.100 నుంచి రూ.300 ఖర్చు..



మిత్రులతో కలిసి నిత్యం రకరకాల టీలు సేవిస్తుంటాను. టీకి ఖర్చు రూ.100 నుంచి రూ.300 వరకు అవుతుంది. ఆయా రకాల టీలను సేవించేందుకు ఇష్టపడతాను. టీ సేవనానికి అడక్ట్ అయ్యాను. – సీహెచ్. అంజయ్య, ధన్వార్

ఫార్మాఫీల్డ్ వదిలి టీ వ్యాపారం వైపు..



డిగ్రీ విద్యాభ్యాసం పూర్తయ్యింది. హైదరాబాద్‌లో ఫార్మాఫీల్డ్‌లో ఉద్యోగం చేసేవాడిని. ఆ వ్యాపారం వదిలి నారాయణఖేడ్‌లో టీ వ్యాపారం పెట్టాను. నాతోపాటు 5గురికి వర్కర్లకు ఉపాధి కల్పిస్తున్నాను. నిత్యం రూ.15వేల వ్యాపారం అవుతుంది. ఖర్చులుపోను రూ.5వేల ఆదాయం ఉంటుంది.
– రవీందర్‌రెడ్డి, టీ వ్యాపారి, నారాయణఖేడ్

పంట నష్టంపై సమగ్ర నివేదిక

- జెడ్పీ సమీక్షలో అధికారులకు చైర్ పర్సన్ రోజాశర్మ సూచన

సిద్దిపేటజోన్: అకాల వర్షాలతో నష్టపోయిన పంట, యాసంగిలో ఎండిపోయిన పంటలకు సంబంధించి నష్ట పరిహారం అందించేందుకు అధికార యంత్రాంగం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ సూచించారు. శనివారం స్థానిక విపంచి ఆడిటోరియంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్, నీటి సరఫరా, వ్యవసాయ, వైద్యం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరా శాఖల పనితీరు సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్పర్సన్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి కొరత లేకుండా అధికారులు సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గృహ, వ్యవసాయ సంబంధించి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. యాసంగి పంట ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు.

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం: కలెక్టర్ మనుచౌదరి

ఈ వేసవిలో జిల్లాలోని ప్రజలకు తాగునీరు సమస్యలు రాకుండా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ కేటాయించిన విషయాన్ని వివరించారు. ప్రతి నియోజకవర్గానికి కోటి రూపాయలు.. ప్రత్యేకంగా తాగునీరు కోసం, అదేవిధంగా జిల్లాకు రూ 3.36 కోట్లు వేసవిలో యాక్షన్ ప్లాన్ నిర్వహణకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. జిల్లాలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

అన్నదాతలకు బీఆర్‌ఎస్ అండ

- రైతుల పరిస్థితి బాధాకరం
- మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి
- ఆర్డీఓ ఆఫీసు ఎదుట రైతు దీక్ష, వినతి

సిద్దిపేటజోన్: రాష్ట్రంలో ప్రస్తుతం రైతుల పరిస్థితి అయోమయంగా ఉందని, విద్యుత్ కోతలు, సాగునీరు లేక రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉందని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు శనివారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రంలో ఎక్కడా రైతులు సంతోషంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయలేదని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఓట్ల కోసం ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పుడు మర్చిపోయిందని ఆరోపించారు. రాజకీయాలు వద్దని, రైతుల, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేయాలని హితవుపలికారు. కేసీఆర్ పిలుపు మేరకు అన్నదాతలకు అండగా ఉండేందుకు బీఆర్‌ఎస్ గళం విప్పిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో దీక్షలు చేస్తామన్నారు. రాజకీయ కారణాల పేరిట కాళేశ్వరం నీటిని రైతులకు విడుదల చేయడం లేదని ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. వ్యవసాయ పంటల కోసం తక్షణమే నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యుత్ వ్యవస్థ కుప్ప కూలిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ కోతలు లేవని, ట్యాంకర్ల బాధలు అసలే లేవని గుర్తు చేశారు. అంతకుముందు దుబ్బాక ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. రైతులకు రూ.500ల బోనస్ హామీని అమలు చేయాలన్నారు. రైతుబంధు ఇవ్వాలని, రుణమాఫీ చేయాలని, విద్యుత్ కోతలు లేని నిరంతర సరఫరా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు శర్మ, పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న వెంకట్రాంరెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

సిద్దిపేటకు రేవంత్ తీరని అన్యాయం

- వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించారు
- మెదక్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం పక్కా
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్/ సిద్దిపేటరూరల్: రేవంత్‌రెడ్డి వల్లే సిద్దిపేటకు తీరని అన్యాయం జరిగిందని, ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇక్కడ మంజూరై నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కళాశాలను సీఎం తన నియోజకవర్గం కొడంగల్‌కు తరలించారని గుర్తు చేశారు. శనివారం రాత్రి తన నివాసంలో బీఎస్పీ నియోజకవర్గ సమన్వయకర్త మద్దెల నర్సింహులు బీఆర్‌ఎస్‌లో ఆయన సమక్షంలో చేరారు. సిద్దిపేట మండల పరిధిలోని ఇర్కోడ్ వద్ద ఉన్న లావణ్య గార్డెన్లో, నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో ఎంపీ ఎన్నికల్లో భాగంగా బీఆర్‌ఎస్ మండల స్థాయి నాయకుల సన్నాహక సమావేశానికి పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ గద్దలా కాలేజీని తన్నుకుపోయిందని విమర్శించారు. సిద్దిపేట ప్రగతిని అడ్డుకున్న పార్టీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని గెలిపించాలని కోరారు. వంద కోట్లతో నియోజకవర్గ ప్రజలకు ట్రస్ట్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. బీజేపీ.. రాజ్యాంగాన్ని మారుస్తానని అంటుందని, ఒక్క ఓటు కూడా వేయొద్దని సూచించారు. నాగర్ కర్నూలు లోక్‌సభను ఆర్‌ఎస్ ప్రవీణ్ గెలువబోతున్నారని జోస్యం చెప్పారు. అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్తారన్నారు. సిద్దిపేట అంటే బీఆర్‌ఎస్ గడ్డ అని మరోసారి నిరూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి, బీజేపీ రఘునందన్ రావులు ప్రజలకు ఇస్తున్న హామీలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్ లను చూపిస్తూ ఎద్దేవా చేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ తాను ఏడున్నరేళ్లపాటు జిల్లాలో కలెక్టర్ గా పని చేశానన్నారు. ఇక్కడ ఎంపీగా పోటీ చేసే అవకాశం రావడం అదృష్టమన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మహిళా విభాగం ప్రతినిధి సువర్ణ, మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎంపీపీలు, వైస్‌ఎంపీపీలు పాల్గొన్నారు.


సిద్దిపేటజోన్: హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నర్సింహులు

• నాచగిరి క్షేత్రం జిగేల్


బ్రహ్మోత్సవాల సందర్భంగా నాచగిరి క్షేత్రం రంగురంగుల కాంతులతో ముస్తాబైంది. లక్ష్మీనృసింహస్వామి, హనుమాన్ దేవతామూర్తుల ఆకృతిలో దీపాల వరుసలు, ఎల్ఈడీ దీపాలతో స్వాగత ద్వారాలు, దీపాల వరుసలతో అలంకృతమైన ఆలయ గోపురం, తూర్పు ద్వారం, సభా మండపం, క్షేత్రాన్ని కాంతిమంతం చేస్తున్నాయి. ఇవి భక్తజనావళిని ఆకట్టుకుంటున్నాయి.
– వర్గల్(గజ్వేల్)

ఘనంగా బీజేపీ ఆవిర్భావం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని, టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ, బైఠక్ సందర్భంగా.. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లలో వండిన అల్పాహారాన్ని టిఫిన్ బాక్స్‌ల్లో తీసుకుని వచ్చి, బూత్ కార్యాలయాల్లో అందరూ కలిసి కుర్చోని తిన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ అభివృద్ధి బీజేపీ పార్టీ తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, ఉపేందర్ రావు, కానుగంటి శ్రీనివాస్, తొడుపునూరి వెంకటేశం, బైరి శంకర్, కృష్ణ, తాటికొండ శ్రీనివాస్, హేమంత్, వేముల శంకర్, నిమ్మల దేవయ్య,.బాషా పాల్గొన్నారు.


టిఫిన్ బైఠక్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

క్లుప్తంగా

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

- సుమారు 500 క్వింటాళ్లు, కంటైనర్ స్వాధీనం



బియ్యం లోడ్‌తో విజిలెన్స్ అధికారులు

తూప్రాన్: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం పట్టణ సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద జరిగింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచారి కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు కంటైనర్ లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే తూప్రాన్ పోలీసులను అప్రమత్తం చేశాం పట్టణ సమీపంలో టోల్ ప్లాజా వద్ద లారీని అదుపులోకి తీసుకొని డ్రైవర్‌ను విచారించగా హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు తరలిస్తున్న ఒప్పుకున్నాడు. లారీలోని సుమారు 500 క్వింటాళ్ల బియ్యం తూప్రాన్ పట్టణ సమీపంలోని నవదుర్గా రైస్‌మిల్‌లో డంప్ చేశామన్నారు. దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ ప్రభాకర్, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, సాంబశివరావు, డిప్యూటీ తహసీల్దార్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించిన అమ్మాయి దక్కలేదని..

- ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన భ్యాగరి స్వామి చిన్న కుమారుడు ప్రశాంత్(24) ఓ పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ప్రేమించిన అమ్మాయికి ఆరు నెలల కిందట వివాహం కావడంతో తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం ప్రశాంత్ కుటుంబ సభ్యులతో కలిసి అల్లాపూర్‌లోని తన అక్క ఇంటికి ఫంక్షన్‌కు వెళ్లాడు. అక్కడ అందరిని కలిసి తిరిగి ఇంటికొచ్చిన ప్రశాంత్ జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందు తన సెల్‌ఫోన్‌లో తాను ఎవరినైనా బాధిస్తే క్షమించాలని, అందరినీ వీడి పోతున్నాని మేసేజ్ చేశాడు. ఇది గమనించిన మిత్రులు ఇంటి వద్దకు వెళ్లి చూడగా సీలింగ్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రసాదం పరిహాసం

మల్లన్న ఆలయంలో అభిషేకం లడ్డూ కనుమరుగు

- తయారీకి నోచుకోని 400 గ్రాముల లడ్డూ
- భక్తులకు 100 గ్రాములు ఉన్నవి నాలుగు అందజేత
- నిబంధనలను తుంగలో తొక్కిన టెండర్ దారులు
- పట్టించుకోని ఆలయ ఉన్నతాధికారులు



స్వామి వారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అభిషేకం లడ్డూ కనుమరుగైంది. ఆలయంలో వివిధ ఆర్జిత సేవలు, కల్యాణం, అభిషేకంతో పాటు వీవీఐపీ దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులకు ఒక్కొక్క టికెట్‌కు ఒక 400 గ్రాములు గల అభిషేకం లడ్డూ అందిస్తారు. కానీ కొంత కాలంగా అభిషేకం లడ్డూకు బదులు 100 గ్రాములు ఉన్న 4 లడ్డూలను భక్తులకు ఆలయ ఉద్యోగులు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో 400 గ్రాములు గల అభిషేకం లడ్డూలు కనిపించడం లేదు. గతంలో లడ్డూ ప్రసాదం తయారీనీ ఆలయం ఆధ్వర్యంలోనే తయారు చేసేవారు. నిర్వహణ భారం పెరగడంతో రెండేళ్లుగా టెండర్లు పిలుస్తున్నారు.

లేబర్ చార్జీల్లో భారీ వ్యత్యాసం..

ఆలయంలో తయారు చేసే 100 గ్రాముల లడ్డూకు, 400 గ్రాముల లడ్డూకు చెల్లించే లేబర్ చార్జీల్లో భారీ వ్యత్యాసం ఉంది. లడ్డూ తయారీకి కావాల్సిన దిట్టం ఆలయ అధికారులు అందిస్తుండగా 100 గ్రాముల లడ్డూ కిలో తయారీకి రూ.38, అదే 400 గ్రాముల లడ్డూ కిలో తయారీకి 1 పైసాకి తెలివిగా కోడ్ చేసి టెండర్ దక్కించుకున్నారు. టెండర్ దారుడు ప్రస్తుతం డబ్బులు అధికంగా వచ్చే 100 గ్రాముల లడ్డూల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. 400 గ్రాముల లడ్డూలు తయారు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. దీనికి ఆలయంలో కొందరు ఉద్యోగులు సహకరించడమే కాకుండా టెండర్‌లో భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం.



పంపిణీకి సిద్ధంగా లడ్డూలు

ఆలయ ఆదాయానికి గండి..

ప్రతి రోజూ స్వామి వారికి నిత్య కల్యాణం, అభిషేకం చేసేందుకు వందల సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి రూ.900 చెల్లించి టికెట్ తీసుకుంటారు. టికెట్‌తోపాటు 400 గ్రాముల లడ్డూ, ఒక శెల్లా, జాకెట్ పీసు ఇస్తారు. వీవీఐపీ దర్శనం టికెట్ రూ.500 కొనుగోలు చేసిన భక్తులకు ఒక 400 గ్రాముల అభిషేకం లడ్డూ ఇస్తారు. ఈ క్రమంలో 400 గ్రాములకు లడ్డూలకు బదులు భక్తులకు 100 గ్రాముల లడ్డూలను 4 అందిస్తున్నారు. రోజు 3 నుంచి 5 వేల అడ్డులు విక్రయిస్తారు. ప్రతీ ఆదివారం 10 నుంచి 20 వేల లడ్డూలు విక్రయిస్తారు. 100 గ్రాముల లడ్డూ తయారీ అధిక వ్యయం అవుతుండడంతో ఆలయ ఆదాయానికి గండి పడుతుంది. ఆలయంలో ఇంతా జరుగుతున్న ఆలయ ఈవో పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లడ్డూలు తయారీ చేయిస్తున్నా



ఆలయంలో అవసరం మేరకు అభిషేకం లడ్డూలను తయారీ చేయిస్తున్నాం. కొన్ని సందర్భాల్లో అభిషేకం లడ్డూ అందుబాటులో లేనప్పుడు మాత్రమే 100 గ్రాముల 4 లడ్డూలను భక్తులకు అందిస్తున్నాం.

– బాలాజీ, ఆలయ ఈవో

నేడు మల్లన్న చివరి వారం

ముగియనున్న బ్రహ్మోత్సవాలు



తోటబావి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీను

కొమురవెల్లి(సిద్దిపేట): కోర్కెలు తీర్చే కోటి మాయాల కొమురవెల్లి మలన్న బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. సంక్రాంతి పండుగ నుంచి ఉగాదికి వరకు జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాలు నేడు అగ్నిగుండాల కార్యక్రమంతో ముగుస్తాయి. చివరి రోజు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. నేటి అర్ధరాత్రి 12 గంటలకు ఆలయ తోట బావి ప్రాంగణంలో నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి అగ్నిగుండాలు దాటుతారు. ఇప్పటి వరకు 11 వారాల్లో సుమారు 15 నుంచి 20 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు కావాల్సిన ఏర్పాట్లను చేశారు. అగ్నిగుండాల కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చేర్యాల సీఐ శ్రీను తెలిపారు. శనివారం అగ్నిగుండాలు నిర్వహించే తోటబావి ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 250 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

కూరగాయల సాగుతో ఆదాయం

కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ నల్కర్

కౌడిపల్లి(నర్సాపూర్): కూరగాయల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ నల్కర్ తెలిపారు. శనివారం మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సాంకేతిక వారోత్సవాల్లో భాగంగా ఎస్సీ సబ్‌ప్లాన్‌లో ద్వారా ఎస్సీ రైతులకు కూరగాయలు, పండ్ల సాగుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధంగా పశుపోషణ, కోళ్ల పెంపకం చేపట్టాలన్నారు. కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఏడాది పొడవున టమాట సాగు చేస్తే డిమాండ్ ఉన్నప్పుడు మంచి ఆదాయం వస్తుందన్నారు. బొప్పాయి పండ్ల తోటతో రైతుల లాభాలు వస్తాయన్నారు. అనంతరం ప్రోగ్రామ్ ఇన్‌చార్జి, శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఉపయోగంచుకోవాలని సూచించారు. సాంప్రదాయ పంటలకు స్వస్తి పలకాలన్నారు. సేంద్రియ పంటలకు డిమాండ్ ఉందని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సీ రైతులకు ప్రియా బ్రిడ్ రకం కోడి పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్‌కుమార్, డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



రైతులకు కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

జోరుగా మట్టి దందా

- అసైన్డ్ భూముల్లో అక్రమార్కుల తవ్వకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ములుగు(గజ్వేల్): మండలంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. అచ్చాయిపల్లి, దాసర్లపల్లి, తండా, కొత్తూరు, బండమైలారం, ములుగు తదితర గ్రామాల్లోని అసైన్డ్ భూములు, చెరువులు, కుంటల్లో అక్రమార్కులు రాత్రి వేళలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాత్రి 10 గంటల తర్వాత హిటాచీ, టిప్పర్లు తెచ్చి మరుసటి రోజు తెల్లవారుజాము 4 గంటల వరకు గుట్టు చప్పుడు కాకుండా దందా కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం రాత్రి వేళల్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనాల్లో మట్టి, ఇసుక వంటివి రవాణా చేయరాదు. ఇవేమి పట్టించుకోకుండా అక్రమంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు.



అచ్చాయిపల్లి సమీపంలో జరిపిన తవ్వకాలు

ధనార్జనే ధ్యేయంగా..

ప్రైవేట్ భూముల నుంచి మొరం, మట్టి తరలించాలన్నా పంచాయతీ, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరి. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వడం కోసం క్యూబిక్ మీటరు చొప్పున నిర్దేశించిన రాయల్టీ చెల్లించాలి. అదే చెరువులు, కుంటల్లో అయితే నీటిపారుదల, గనుల శాఖల నుంచి అనుమతి పొందాలి. అక్రమార్కులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా భారీ యంత్రాలతో మట్టిని తవ్వి టిప్పర్లతో రవాణా చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అడపా దడపా దాడులు చేసి ఒకటో, రెండో వాహనాలను పట్టుకోవడం తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎవరైనా ఉపేక్షించం

అనుమతి లేకుండా మట్టి, మొరం తరలించడం నేరం. మండలంలో ఎక్కడైనా మట్టి అక్రమ రవాణా జరిగితే స్థానికులు సమాచారం ఇవ్వాలి. ఎవరిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే అక్రమంగా రవాణా చేస్తున్న మట్టి, ఇసుక వాహనాలను పట్టుకొని సీజ్ చేశాం.

– ప్రవీణ్‌రెడ్డి, తహసీల్దార్

ప్రాణం తీసిన ఈత సరదా

సింగూరు ఎడమ కాల్వలో మునిగి వ్యక్తి మృతి

పుల్కల్ (అందోల్): సింగూరు ఎడమ కాల్వలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన పుల్కల్ మండల పరిధిలోని బస్వాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బస్వాపూర్ గ్రామానికి చెందిన దప్పు వినోద్ (22) కొన్నేళ్లుగా సదాశివపేటలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం స్నేహితులతో కలిసి గ్రామ శివారు పక్కనే ఉన్న సింగూరు ఎడమ కాల్వకు ఈత కోసం వెళ్లాడు. వినోద్ ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు గాలింపు చర్యలు చేపట్టారు. అంతే కాకుండా సింగూరు ఎడమ కాల్వ నీటిని నిలిపివేశారు. మత్స్యకారులు, గ్రామస్తులు రెండు గంటల పాటు తీవ్ర ప్రయత్నం చేయగా చివరకు అర కిలోమీటర్ దూరంలో వినోద్ మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పుల్కల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

- హత్య అంటూ కుటుంబీకుల ఆరోపణ



నరేశ్ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని హస్తాల్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన జాల సావిత్రి, గణేశ్ దంపతులకు కుమారుడు నరేశ్(17), కూతురు ఉన్నారు. రోజుమాదిరిగా నరేశ్ శుక్రవారం రాత్రి ఇంటి దాబాపై నిద్రించగా గ్రామానికి చెందిన చిట్యాల యాదాగౌడ్ శనివారం తెల్లవారుజామున గడ్డి ట్రాక్టర్‌పై కూలీ కోసం తీసుకెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి నరేశ్ ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో గాయపడ్డాడని చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు చెప్పారు. కుటుంబీకులు ఆస్పత్రికి వెళ్లేసరికి నరేశ్ మృతి చెంది ఉన్నాడు. ట్రాక్టర్ యజమాని చిట్యాల యాదాగౌడ్‌కు మాకు కొన్ని నెలల కిందట భూతగాదాలు జరిగాయని, వాటిని దృష్టిలో ఉంచుకునే నా కుమారుడిని హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడంటూ మృతుడి తండ్రి ఆరోపించారు. ట్రాక్టర్‌పై నుంచి పడితే ఆస్పత్రికి తీసుకెళ్లక రోడ్డు పక్కన ఓ చిన్న గుడిసెలో మృతదేహాన్ని పడేసి ట్రాక్టర్‌తో వెళ్లి పోలీస్ స్టేషన్‌లో యాదాగౌడ్ ఎలా లొంగిపోతారని ప్రశ్నించారు. మాకు తగిన న్యాయం చేయాలని జిల్లా అధికారులను వేడుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ నవతగౌడ్‌ను వివరణ కోరగా ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

తల్లీ, కూతురికి గాయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేద కుటుంబాన్ని సిలిండర్ ప్రమాదం రోడ్డున పడేసింది.. పూరి గుడిసె దగ్ధం కావడంతో తల్లి కూతురికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన శివరాత్రి ఐలయ్య, కనకలక్ష్మీ దంపతులకు కూతురు అశ్విని ఉంది. గ్రామంలోనే వృత్తిరీత్యా వడ్డెర పనులు చేసుకుంటూ పూరి గుడిసెలో జీవనం కొనసాగిస్తున్నారు. రోజువారిలాగే శుక్రవారం రాత్రి భోజనం చేసి తల్లీకూతురు గుడిసెలో, ఐలయ్య గుడిసె ఎదుట నిద్రపోయారు. శనివారం తెల్లవారు జామున ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి సిలిండర్ పేలి గుడిసె దగ్ధమైంది. దీంతో కనకలక్ష్మీ, అశ్వినికి గాయాలయ్యాయి. వెంటనే ఐలయ్య అప్రమత్తమై సిలిండర్‌ను ఆరుబయటకు నెట్టేశాడు. ఇందులో నగదు రూ. 20 వేలు, నిత్యావసర సరుకులు కాలిపోయాయని వాపోయారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



గుడిసెను చూపుతున్న బాధితుడు ఐలయ్య

హత్యా.. ఆత్మహత్యా?

పోలీసులకు సవాల్‌గా మారిన భీమయ్య మృతి

వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని మంగళపర్తిలో రెండు రోజుల కిందట చోటు చేసుకున్న మంగళి భీమయ్య మృతి కేసు పోలీసులకు సవాలుగా మారింది. పంట చేనుకు నీరు పెట్టడానికి వెళ్లి పొలం వద్దే రైతు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి భార్య పెంటమ్మ భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి శుక్రవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించే క్రమంలో వైద్యుడు మృతుడి చెవి కింది భాగంలో ఏర్పడిన గుంతపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భీమయ్య మృతిపై గ్రామస్తుల అనుమానాలు రెట్టింపయ్యాయి. శనివారం ఉదయం మరోసారి తూప్రాన్ సీఐ కృష్ణ, తూప్రాన్ ఎస్‌ఐ శివానందం, వెల్దుర్తి ఎస్‌ఐ నవతగౌడ్ ఘటనా స్థలాన్ని క్లూస్ టీంతో సందర్శించి పలు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మొదట గుర్తించిన గొల్ల చిన్న నర్సింలుతో పాటు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. ఈ విషయమై తూప్రాన్ సీఐ కృష్ణను వివరాలు అడుగగా.. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. భీమయ్యది హత్యా.. ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు.



ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్న తూప్రాన్ సీఐ కృష్ణ, క్లూస్ టీం, ఎస్‌ఐలు

పార్ట్ టైం జాబ్ పేరుతో మోసం

రూ.3.42 లక్షలు పోగొట్టుకున్న ఇద్దరు ఉద్యోగులు



పటాన్‌చెరు టౌన్ : పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు స్పందించి ఇద్దరు ఉద్యోగులు డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని గ్రీన్ విడోస్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మార్చి 13వ తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. ఉద్యోగిని తన వివరాలను నమోదు చేసి రూ.2 వేలు చెల్లించి టాస్క్‌లు చేయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో బాధితురాలు మొత్తం రూ.2 లక్షల 92 వేలు చెల్లించింది. ఉద్యోగిని చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.50 వేలు పెట్టుబడి..

అమీన్‌పూర్ పరిధిలోని పీఎస్‌ఆర్ కాలనీకి చెందిన ప్రైవేటు ఉద్యోగికి జనవరి 31 తేదీన పార్ట్ టైం జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేశాడు. మొత్తం రూ. 50 వేలు ఇన్వెస్ట్ చేసి, చివరికి తాను పెట్టిన డబ్బుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శనివారం అమీన్‌పూర్ పోలీసుల ఫిర్యాదు చేశాడు.

రుణ రాక్షసం..

ఆయువు తీస్తున్న ఆన్‌లైన్ లోన్ యాప్స్

- అడ్డగోలుగా వడ్డీ వసూలు
- అశ్లీల, అసభ్యకర పోస్టులు పెడుతూ బెదిరింపులు
- వేధింపులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న బాధితులు

వట్‌పల్లి(అందోల్): ఆన్‌లైన్ లోన్‌యాప్‌లు ఆశపెట్టి ఆయువు తీస్తున్నాయి. రుణాలతో అమాయకుల జీవితాలతో ఆటలాడుతున్నాయి. వారి వలలో పడి రుణాలు తీసుకున్న అమాయకులు తిరిగి చెల్లించలేనప్పుడు వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లా అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఓ యువకుడు లోన్ యాప్ దారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది.

ఒక్క క్లిక్‌తో అంతే..

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి... 'హామీ లేకుండానే రుణం పొందండి' అంటూ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఇవి. దీనికి పేద, మధ్య తరగతి వర్గాల వారు ఆకర్షితులై తమ మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వివరాలు ఇవ్వడమే ఆలస్యం. క్షణాల్లో రుణం ఖాతాలో జమవుతోంది. డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లు, ఫొటోలు, వీడియోలు సహా అన్నింటికీ యాప్ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాలి. లేదంటే రుణం రాదంటారు. యాక్సెస్ ఇవ్వగానే రుణం తీసుకున్న వారి వివరాలు రుణ యాప్‌లోకి వెళ్లి సర్వర్లకు అనుసంధానమవుతుంది.



శ్రీకాంత్ రుణం పొందిన లోన్‌యాప్‌లు

దా'రుణ' వేధింపులు..

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసం నిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారు. చెల్లింపు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు పెరిగిపోతాయి. రుణగ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే అశ్లీల అసభ్యకర పోస్టులు, దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, ఫొటోలు పంపిస్తారు. బెదిరింపులు లెక్క చేయకపోతే రుణగ్రహీత కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి మొబైల్‌లోని కాంటాక్టు నంబర్లన్నింటికీ వాట్సాప్‌లలో పంపుతారు. వీరి ఆగడాలను కొందరు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతూ బలవన్మరణాలకు పాల్పడుతుంటే.. ఇంకొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

యువకుడి ఆత్మహత్య



అందోలు మండలంలోని కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాడెం శ్రీకాంత్(23) ఇటీవల ఇన్‌స్టంట్ లోన్ యాప్‌లో ఆరు పేజీలను ఓపెన్ చేశాడు. ఓ పేజీలో రూ.36 వేల లోన్ కోసం రిక్వెస్ట్ చేసుకోగా కేవలం రూ.9 వేలు మాత్రమే ఖాతాలో జమ అయ్యింది. ఇలా మొత్తంగా రూ.30 వేల వరకు లోన్ తీసుకున్నాడు. తీసుకున్న మరునాటి నుంచే లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు మొదలవడంతో రూ.1.30 లక్షల వరకు చెల్లించాడు. అయినా ఇంకా డబ్బులు కట్టాలంటూ వేధించసాగారు. యువకుడి ఫొటోను అశ్లీల చిత్రంగా మార్ఫిడి చేసి వారి కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులకు పంపడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్మకు పాల్పడ్డాడు.

లోన్ల జోలికి వెళ్లొద్దు

లోన్ల పేరుతో బురిడీ కొట్టించే లోన్ యాప్‌లను నమ్మి డౌన్‌లోడ్ చేసుకొని యువత మోసపోవద్దు. సులువుగా రుణాలు ఇస్తున్నారన్న ఆశకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఆ యాప్‌ల నుంచి రుణాలు పొందిన వారు వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి. వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– అరుణ్‌కుమార్ గౌడ్, ఎస్‌ఐ జోగిపేట